సాక్షి మహబూబ్‌నగర్

బుధవారం । 26 । మార్చి । 2025



సహాయక చర్యల్లో పురోగతి

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చేపడుతున్న సహాయక చర్యల్లో కొంత పురోగతి కనిపించింది.

వివరాలు 8లో ▸

ఇఫ్తార్ 6-36 (బుధవారం సాయంత్రం)

సహర్ 4-56 (గురువారం తెల్లవారుజామున)

రంజాన్ వేళలు

గరిష్ఠం/కనిష్ఠం 38.1 /19.2

వాతావరణం

ఎండ ఎక్కువగా ఉంటుంది. వేడి గాలులు వీస్తాయి. సాయంత్రం జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాలల హక్కులపై అవగాహన



పాలమూరు: జిల్లాకేంద్రంలోని బాలసదన్ గృహాన్ని మంగళవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర సందర్శించారు. వసతులు, సౌకర్యాలపై ఆరా తీయడంతో పాటు చిన్నారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నారా? లేదా అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేట్ హోం సందర్శించి అక్కడ నల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ చిల్డ్రన్ అండ్ ప్రొటెక్షన్ స్కీంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులు, బాల్య వివాహాలు తదితర చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.

వారం రోజుల్లో 1,052 మంది రక్తదానం



పాలమూరు: షహీద్ దివాస్ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 23వరకు చేపట్టిన రక్తదాన శిబిరాలకు విశేష స్పందన లభించిందని రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 1,052 మంది రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న వారిని రక్తదానం ద్వారా కాపాడుకోవచ్చని, యుక్త వయసులో ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేసి బాధ్యత చాటుకోవాలని సూచించారు.

ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర రూ.2,205

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో మంగళవారం జరిగిన ఈ టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,205, కనిష్ఠంగా రూ.1,909గా పలికింది. యాసంగి సీజన్ వరి ధాన్యం కోతకు రావడంతో రైతులు వచ్చిన దిగుబడులను మార్కెట్‌కు తీసుకురావడం ప్రారంభించారు. దాదాపు 300 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. కాగా.. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఉల్లిపాయల బహిరంగ వేలం ప్రారంభం అవుతుంది.

వేరుశనగ క్వింటాల్ రూ.6,411


జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం వేరుశనగకు క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,411, కనిష్ఠంగా రూ.5,100 ధరలు లభించాయి. కందులు గరిష్ఠంగా రూ.6,792, కనిష్ఠంగా రూ.4,000, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,281, కనిష్ఠంగా రూ.1,791 ,జొన్నలు గరిష్ఠంగా రూ.4,328, కనిష్ఠంగా రూ.3,070, ఆముదాలు గరిష్ఠంగా రూ.6,300, కనిష్ఠంగా రూ.5,870, మినుములు రూ.7,260 ధరలు లభించాయి. దేవరకద్ర మార్కెట్‌లో ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.2,205, కనిష్ఠంగా రూ.1,909గా పలికింది. యాసంగి సీజన్ వరి ధాన్యం కోతకు రావడంతో రైతులు వచ్చిన దిగుబడులను మార్కెట్‌కు తీసుకురావడం ప్రారంభించారు. దాదాపు 300 బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది. కాగా.. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఉల్లిపాయల బహిరంగ వేలం ప్రారంభం అవుతుంది.

ఏఐ బోధనతో విద్యార్థులకు మేలు

- డీఈఓ ప్రవీణ్‌కుమార్



మిడ్జిల్: ప్రభుత్వ పాఠశాలలో ఏఐ విద్యా బోధనతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని డీఈఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో, వల్లభరావుపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను ప్రారంభించారు. చదువులో వెనుకబడిన 3, 4, 5 తరగతుల విద్యార్థుల కోసం ఏఐ ప్రోగ్రాంను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు ఈకార్యక్రమాన్ని విద్యార్థులకు సద్వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, శ్రీనివాసులు, సీఎంఓ బాలు యాదవ్, ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎం సరస్వతి పాల్గొన్నారు.



డామిట్.. కథ అడ్డం తిరిగింది!

అనధికార జీపీ లేఅవుట్లకు అక్రమ రిజిస్ట్రేషన్లు..

రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో అక్రమ లేఅవుట్లు, రిజిస్ట్రేషన్ లేని ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు 2020 సెప్టెంబర్‌లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశం కల్పించింది. 2020 ఆగస్టు 26లోగా సేల్‌డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసిన లేఅవుట్ యజమానులు, ప్లాటు ఓనర్లకు ఎల్‌ఆర్‌ఎస్ వర్తిస్తుందని ప్రకటించింది. 2021లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు స్వీకరించింది. ఆ తర్వాత ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అనుమతి లేని లేఅవుట్లు, అనధికార ప్లాట్ల రిజిస్ట్రేషన్లను గత సర్కార్ నిలిపివేయడం కొందరు సబ్ రిజిస్ట్రార్లకు కాసులపంట పండించింది. 2021 నుంచి 2024 వరకు పలువురు రిజిస్ట్రేషన్ అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులు పరిష్కారం కాకుండానే.. రియల్టర్లతో కుమ్మక్కై వేల సంఖ్యలో అనధికార జీపీ లేఅవుట్లకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారు. ప్రస్తుతం 25 శాతం రాయితీ కల్పించినా.. రిజిస్ట్రేషన్ పూర్తయిన నేపథ్యంలో ఎప్పుడైనా క్రమబద్ధీకరించుకోవచ్చనే ఉద్దేశంతో ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదని 'సాక్షి' పరిశీలనలో తేలింది.

అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణ ద్వారా భారీగా ఆదాయం సమకూర్చుకోవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 31వ తేదీ వరకు క్రమబద్ధీకరించుకునే వారికి 25 శాతం రాయితీ కల్పించింది. ఇంత వరకు బాగానే ఉన్నా.. క్రమబద్ధీకరణకు దరఖాస్తుదారులు ముందుకు రాకపోవడంతో సర్కారు నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరే పరిస్థితి కన్పించడం లేదు. ఈ నేపథ్యంలో అసలు ఎందుకీ పరిస్థితి నెలకొంది.. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరించిన అక్రమార్కులు ఎవరు.. దరఖాస్తుదారులు ఎందుకు ముందుకు రావడం లేదు వంటి అంశాలపై 'సాక్షి' పరిశీలనాత్మక కథనం..

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/మెట్టుగడ్డ

నత్తనడకన ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ

- 25 శాతం రాయితీ ఇచ్చినా ముందుకు రాని దరఖాస్తుదారులు
- పలు అనధికార జీపీ లేఅవుట్లకు ఇది వరకే రిజిస్ట్రేషన్లు
- అప్పటి సబ్‌రిజిస్ట్రార్లకు కాసుల పంట పండినట్లు అనుమానాలు
- తాజాగా తూతూమంత్రంగా అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన
- సర్కారు ఆదాయానికి భారీగా గండి.. పూర్తిస్థాయిలో విచారణకు సన్నద్ధం



మహబూబ్‌నగర్‌లో ఎల్‌ఆర్‌ఎస్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ (ఫైల్)

ఎల్‌ఆర్‌ఎస్‌తో కూడిన రిజిస్ట్రేషన్లు 500ల్లోపే..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 406 దస్తావేజులకు ఎల్‌ఆర్‌ఎస్‌తో కూడిన రిజిస్ట్రేషన్లు జరిగాయి. మహబూబ్‌నగర్‌లో 30, జడ్చర్లలో 42, వనపర్తిలో 107, ఆత్మకూర్‌లో 8, గద్వాలలో 59, అలంపూర్‌లో 14, నారాయణపేటలో 17, మక్తల్‌లో 4, నాగర్‌కర్నూల్‌లో 26, అచ్చంపేటలో 3, కల్వకుర్తిలో 71, కొల్లాపూర్‌లో 25 వరకు ఎల్‌ఆర్‌ఎస్‌తో కూడిన రిజిస్ట్రేషన్లు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ గణాంకాలు ఈ నెల 19వ తేదీ వరకు కాగా.. ఇప్పటి వరకు మరో సుమారు 80 దస్తావేజుల వరకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది.

అక్రమ రిజిస్ట్రేషన్లకు ఉదాహరణలు..

■ వనపర్తిలో 2023–24లో సుమారు 6 వేల డాక్యుమెంట్లకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ మేరకు సదరు అధికారిని అప్పట్లో సస్పెండ్ చేశారు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆయన విధుల్లో చేరారు. ప్రస్తుతం వేరే చోటకు బదిలీ అయ్యారు. ఆ సమయంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి.

■ నాగర్‌కర్నూల్‌లో 2022–23లో మూడు రోజుల్లో సుమారు 300 డాక్యుమెంట్లు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు.

■ జడ్చర్లలో 2022–24లో నాలుగు వేల దస్తావేజులకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది.

■ అలంపూర్‌లో 2021–23 కాలంలో సుమారు 200 డాక్యుమెంట్లకు అప్పటి అధికారులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం.

■ మహబూబ్‌నగర్‌లో 2022 నుంచి 2024 వరకు అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం నిరాటంకంగా కొనసాగినట్లు ఆ శాఖ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎదిర, అప్పనపల్లి శివారు, పాల్కొండ, కోయిల్‌కొండ, మహబూబ్‌నగర్ రూరల్ మండలం తదితర ప్రాంతాల్లో అనధికార జీపీ లేఅవుట్లకు పెద్దమొత్తంలో డబ్బులు దండుకుని ఆ శాఖ అధికారులు పలువురు అక్రమ రిజిస్ట్రేషన్ల తంతు నడిపించినట్లు సమాచారం.

■ నారాయణపేట, మక్తల్‌లో కూడా అక్రమ రిజిస్ట్రేషన్ల తంతు నడిచింది. ఆయా ప్రాంతాల్లో పలువురు సబ్ రిజిస్ట్రార్లతో పాటు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు అక్రమ రిజిస్ట్రేషన్లలో భాగస్వాములైనట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. పలు ప్రాంతాల్లో ఆయా అధికారులు సెలవులపై వెళ్లి.. కిందిస్థాయి ఉద్యోగులతో అక్రమంగా రిజిస్ట్రేషన్ల తంతు ముగించినట్లు తెలిసింది.

రూ.6 కోట్ల వరకు నష్టం.. విచారణకు సన్నద్ధం

ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో సుమారు రూ.5 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడినట్లు అంచనా. ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ఐదు రోజుల్లో ముగియనున్న నేపథ్యంలో అధికారులు అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని చెబుతున్నా.. గతంలోనే రిజిస్ట్రేషన్లు పూర్తికావడంతో తలనొప్పులు ఎందుకని భావించి మౌనం వహిస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ తీసుకొచ్చినా.. 25 శాతం రాయితీ కల్పించినా.. ప్రజలు ముందుకు రాకపోవడం, సరైన ఆదాయం సమకూరకపోవడం.. జీపీ లేఅవుట్ల అక్రమ రిజిస్ట్రేషన్లతో కొందరు సబ్ రిజిస్ట్రార్లు కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణకు సన్నద్ధమవుతుండగా.. అక్రమార్కుల్లో భయం నెలకొంది.

సామాన్యులపై భారం మోపొద్దు



అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాట తప్పడమే కాకుండా ప్రజలపై భారం మోపుతోంది. ఓపెన్ స్పేస్ రుసుం భారం సామాన్య ప్రజలపై మోపడం అన్యాయం. 2022–24 మధ్యలో గ్రామ పంచాయతీ ప్లాట్లను కొందరు సబ్‌రిజిస్ట్రార్లు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేశారు. ముందుగా ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలి. ఎల్‌ఆర్‌ఎస్‌పై 75 శాతం రాయితీ ఇవ్వాలి. ప్లాట్లు కొన్న సామాన్య ప్రజలపై భారం మోపొద్దు.

– మహ్మద్ అన్వార్ హుస్సేన్, బంగారు తెలంగాణ రియల్ ఎస్టేట్స్ మార్కెటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆధారాలతో వస్తే చర్యలు తీసుకుంటాం..



ఎల్‌ఆర్‌ఎస్‌పై అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. డాక్యుమెంట్ రైటర్లు, రియల్ వ్యాపారులతో సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నాం. మార్చి 31 వరకు ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. జీపీ లే అవుట్లలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు మా దృష్టికి వచ్చిన మాట వాస్తవమే, కోర్టు ఆర్డర్స్‌తో కొన్ని, కొందరు రూల్స్ అతిక్రమించి రిజిస్ట్రేషన్లు చేసిన వారిని సస్పెండ్ చేశాం. ఇంకా ఎక్కడైనా అలా జరిగినట్లు మా దగ్గరకు ఆధారాలతో వస్తే చర్యలు తీసుకుంటాం.

– వి.రవీందర్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జిల్లా రిజిస్ట్రార్

కల్తీ కల్లు, గంజాయి కట్టడికి చర్యలు

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాలో గంజాయి, కల్తీ కల్లు కట్టడి కోసం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎస్పీ డి.జానకి వెల్లడించారు. గంజాయి, కల్తీ కల్లు నిర్మూలనపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోస్టర్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత, ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ప్రభుత్వం నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించడం వల్ల వ్యక్తిగతంగా, కుటుంబపరంగా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి విక్రయాలు లేదా వినియోగం, కల్తీ కల్లు తయారీ, సరఫరా చేస్తున్నట్లు సమాచారం అందిస్తే అలాంటి వారి సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లాలో మత్తు పదార్థాలను నిర్మూలించేందుకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పోస్టర్లను రద్దీ ప్రాంతాలు బస్టాండ్, రైల్వేస్టేషన్, కళాశాలలో అతికించడంతో పాటు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ బుచ్చయ్య, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ ఇతర అధికారులు

ప్రతి హామీ నెరవేర్చి తీరుతాం



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరుతామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం అసెంబ్లీలో విద్యపైన జరిగిన చర్చలో పాల్గొని మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ హయాంలో ఈ రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పన కింద 24 వేల పనులు చేయించామన్నారు. మహబూబ్‌నగర్‌లోని ఒకేషనల్ జూనియర్ కళాశాలలో 50 శాతం అడ్మిషన్లు పెరిగాయన్నారు. ఇప్పుడు అక్కడ 150 మంది బాలికలు అడ్మిషన్లు తీసుకున్నారన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

హన్వాడ: రైతుల జీవితాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెలగాటమాడుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం నాగినోనిపల్లిలో ఇటీవల వడగండ్ల వానకు దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో రైతుబంధు రూ.15 వేలకు పెంచుతామని చెప్పి.. ఇవ్వడం లేదని, విద్యుత్ సరఫరా గాలికొదిలారని, రైతు భరోసాను సక్రమంగా పంపిణీ చేయకుండా మోసం చేస్తున్నట్లు విమర్శించారు. ప్రభుత్వ అసమర్థత వల్ల రైతులు దగా పడుతున్నారని విమర్శించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, లేకుంటే రైతుల పక్షాన ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కరుణాకర్‌గౌడ్, లక్ష్మయ్య, శ్రీను, జంబులయ్య, చెన్నయ్య, అనంతరెడ్డి, బాలకిష్టయ్య, చందర్, వెంకన్న, మాధవులు, రాజుయాదవ్, తిర్పతయ్య, రామకృష్ణయ్య పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మెనూ పాటించకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం



నంచర్ల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర

- నంచర్ల జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్నభోజనం పరిశీలన

మహమ్మదాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, లేదంటే చర్యలు తప్పవని కలెక్టర్ విజయేందిర బోయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మహమ్మదాబాద్ మండలంలోని నంచర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం కూరగాయలు, భోజనం, ఆకుకూరలు, గుడ్లు ఇవ్వకపోవడంపై నిర్వాహకులపై, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నంచర్ల, గాధిర్యాల్ పాఠశాలల్లో ఏఐ ల్యాబ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులకు ఏఐ ఆధారిత కంప్యూటర్ ద్వారా బోధన చేసి వారి ప్రగతిని పరిశీలించాలన్నారు. 9వ తరగతిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తమ లక్ష్యం మేరకు చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో మిషన్ భగీరథ, ఇరిగేషన్, వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీరు, సాగునీరు, పంటల సాగుపై మాట్లాడారు. బోరు బావుల కింద వేసిన సుమారు 140 ఎకాల్లో పంటలు ఎండిపోయినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, హెచ్‌ఎం సురేందర్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

అర్అండ్ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించిన ఆర్అండ్ఆర్ కాలనీల్లో అన్నిరకాల మౌలిక సౌకర్యాలు వేగవంతం చేయాలని ఆర్అండ్ఆర్ కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్‌లో కలెక్టర్ విజయేందిరతో కలిసి అధికారులు సమీక్షించారు. ఉదండపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండాపూర్, తుమ్మలకుంటతండా, రేగడి పట్టితండా, చిన్నగుట్టతండా, శఖూమగడ్డతండా, ఒంటిగుడిసెతండా పోలేపల్లి, వ్యవసాయ క్షేత్రంలో ఇళ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు 300 గజాల స్థలం, ప్రైమరీ హెల్త్ సెంటర్, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, పార్కు పనులు నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని వినయ్‌కృష్ణారెడ్డి అన్నారు. మిషన్ భగీరథ వాటర్ పైపులైన్లు ఇచ్చిన గడువులోగా పూర్తయ్యేలా చూడాలన్నారు. అదనపు కలెక్టర్‌మోహన్‌రావు, స్పెషల్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్‌డీఓ నవీన్ పాల్గొన్నారు.

ఎలాంటి ఫిర్యాదు రాకుండా చూసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్ ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం కావడంతో తాగునీటి సరఫరాలో ఎలాంటి అవాంతరాలు రావొద్దన్నారు. ఎక్కడైనా లీకేజీలుంటే వెంటనే బాగు చేయించాలని, విద్యుత్ మూడో వైరును ఏర్పాటు చేసి, వీధి దీపాలు సమయానికి వెలిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్, డీఈఈ నర్సింహ, ఏఈలు వైష్ణవి, నుస్రత్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శివశక్తినగర్‌లో ఓపెన్ నాలాను పరిశీలించి వెంటనే డ్రెయినేజీ నిర్మించాలని ఆదేశించారు. అలాగే వన్‌టౌన్ ప్రాంతంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి కమిషనర్‌కు తగు సూచనలిచ్చారు.



వన్ టౌన్ ప్రాంతంలో ఓపెన్ నాలాను పరిశీలిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి శివేంద్రప్రతాప్

పోరాటాలతోనే హక్కుల సాధన



జిల్లా కేంద్రంలో టీయూసీఐ ఆధ్వర్యంలో కార్మికుల ప్రదర్శన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పోరాటాలతోనే కార్మిక హక్కులను సాధించుకోగలుగుతామని తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (టీయూసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు ఎం.హన్మేష్, ప్రధాన కార్యదర్శి కె.సూర్యం అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ టౌన్ హాల్ నుంచి భవన నిర్మాణ కార్మికులతో ర్యాలీ తీశారు. అనంతరం బోయపల్లిగేట్ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సంఘం మూడో రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉన్నారన్నారు. వారి కోసం సంక్షేమ పథకాలను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధనికుల కోసమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికులకు కనీస పింఛను రూ. ఆరు వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.కృష్ణ, బీటీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివుడు, టీయూసీఐ నాయకులు సి.వెంకటేశ్, పి.అరుణ్‌కుమార్, దేవదానం, కె.రవి, కిరణ్ పాల్గొన్నారు.

న్యాయవాద రక్షణ చట్టం అమల్లోకి తేవాలి

- కోర్టు విధులు బహిష్కరించి, నిరసన తెలిపిన న్యాయవాదులు



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

పాలమూరు: రాష్ట్రంలో వెంటనే న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని జిల్లా బార్ అసోసియేషన్ ఆపద్ధర్మ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయిల్ హత్యను నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు కోర్టులో విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు తొలుత కోర్టు ఎదుట ఆందోళన చేసి.. అక్కడి నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదుల హత్యలను ప్రభుత్వం నివారించాల్సిన అవసరం ఉందని, ఇప్పటికే చాలా చోట్ల న్యాయవాదులపై ప్రత్యక్ష దాడులు, హత్యలు జరగడం బాధాకరమన్నారు. మాజీ అధ్యక్షుడు అనంతరెడ్డి, చంద్రమౌళి, అనిల్ కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం తెస్తూ, న్యాయవాదులపై జరిగిన దాడులపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా విచారించాలన్నారు. ఈ కేసులలో ఉన్న నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి న్యాయవాదుల సమస్యపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవికుమార్, పుట్టపాగ రఘుపతి, నరేందర్‌గౌడ్, కాంతారెడ్డి, ఎస్.పీ వెంకటేష్, జాకీర్ హుస్సేన్, ఉమా మహేశ్వరి, జ్యోతి, రాజేంద్ర కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాము కాటుకు వ్యక్తి బలి


నాగేష్(ఫైల్)

చిన్నచింతకుంట: పాము కాటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కౌకుంట్ల మండలం తిర్మలాపూరంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన గుడికాడి నాగేష్ (40) సోమవారం రాత్రి తన ఇంట్లో నిద్రిస్తుండగా కట్ల పాము కాటేసింది. గమనించిన నాగేష్ నిద్రలేచి పామును చంపాడు. కుటుంబ సభ్యులతో కలిసి చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. అక్కడ వైద్యులు లేకపోవడంతో ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా అక్కడి వైద్యులు వనపర్తి ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు.పరిస్థితి విషమించడంతో అక్కడినుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

బిహార్‌వాసి బలవన్మరణం

వెల్దండ: మండలంలోని రాచూర్‌తండా సమీపంలో బిహార్‌కు చెందిన మోహిత్‌కుమార్ పాశ్వన్ (19) సోమవారం అర్ధరాత్రి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ జాకీర్ ఉల్లా తెలిపారు. ఆయన కథనం మేరకు.. బిహార్ రాష్ట్రం ఔరంగాబాద్ జిల్లా కుదుమా మండలం కస్తూరిపూర్తికి చెందిన మోహిత్‌కుమార్ పాశ్వన్ రాచూర్ సమీపంలోని వింటేజ్ కాఫీ కంపెనీలో 20 రోజులుగా పని చేస్తున్నాడు. రోజులాగే సోమవారం రాత్రి భోజనం అనంతరం రాచూర్‌తండాలో సమీపంలో వారు ఉండే షెడ్‌కు వచ్చి ఆరు బయట పడుకున్నాడు. అర్ధరాత్రి రాత్రి దాటాక షెడ్‌లోని ఇనుప రాడ్‌కు ఊరేసుకున్నాడు. మంగళవారం ఉదయం తోటి కూలీలు షెడ్ వద్దకు వచ్చే సరికి చనిపోయి కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వివరించారు.

చెక్‌డ్యాంలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

గోపాల్‌పేట: చెక్‌డ్యాంలో ఈతకు వెళ్లిన ఓ వ్యక్తి ఒడ్డుకు చేరుకోలేక మృతిచెందాడు. ఎస్‌ఐ నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. వనపర్తికి చెందిన ఆవుల శ్రీను(40) ఈ నెల 23న గోపాల్‌పేట మండలంలోని మున్ననూరులో బంధువుల ఇంటికి వచ్చాడు. ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో గ్రామ శివారులోని కొత్తబావి చెక్‌డ్యాంలో ఈత పడేందుకు వెళ్లాడు. అయితే అప్పటికే మద్యం తాగి ఉండటంతో నీటిలోంచి ఒడ్డుకు ఈదలేక మునిగిపోయి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు సోమవారం చెక్‌డ్యాంలో గాలించిన ఫలితం లేకపోయింది. మంగళవారం చెక్‌డ్యాంలో మృతదేహం పైకి తేలడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మృతదేహాన్ని బయటికి తీసి పరిశీలించారు. వనపర్తికి చెందిన ఆవుల శ్రీనుగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై ఆవుల శ్రీను భార్య ఆవుల విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

మద్యం మత్తులో కిందపడి..

గద్వాల: మద్యం మత్తులో కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మంగళవారం తెల్లవారుజామున ధరూరు మండల కోతుగిద్దె సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. వివరాలు.. గద్వాలకి చెందిన దర్శెల్లి అనే వ్యక్తి కోతులగెద్దె సమీపంలో రోడ్డు పక్కనే మద్యం మత్తులో అదుపు తప్పి కింద పడ్డాడు. తలకిందులుగా పడిపోవడంతో పైకి లేవలేక ఊపిరాడక మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గద్వాల ఆస్పత్రికి కేసు నమోదు చేశామన్నారు.

యువతిపై కేసు నమోదు

కోస్గి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి ఈ నెల 22న కోస్గి మండలంలో పర్యటన సందర్భంగా అనుచిత వ్యాఖ్యలు చేసిన యువతిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాలరాజ్ తెలిపారు. మండల పర్యటనలో భాగంగా బిజ్జారం గ్రామంలో భోజనం చేసేందుకు పార్టీ నాయకులు, అధికారులతో కలిసి తిరుపతిరెడ్డి వెళ్లగా.. హన్మాన్‌పల్లికి పద్మ ముఖ్యమంత్రి సోదరుడు భూకబ్జాలు చేయడానికి వచ్చాడంటూ వాట్సప్ గ్రూపుల్లో ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు. నిరాధారమైన ఆరోపణలతో పాటు తప్పుడు ప్రచారం చేసిన యువతిపై ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చిరుత దాడిలో లేగ మృతి

కొత్తపల్లి: చిరుత దాడిలో లేగ మృతిచెందిన ఘటన మండలంలోని గోకుల్‌నగర్‌లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బాధిత రైతు కావలి గోవిందు కథనం మేరకు.. గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద రోజువారీగా సోమవారం రాత్రి పశువులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా లేగ మృతిచెంది కనిపించింది. చిరుత దాడితోనే మృతి చెందినట్లు బాధితుడు వివరించారు. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారి వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోను ఏర్పాటు చేస్తామని.. చుట్టుపక్కల గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సహాయక చర్యల్లో పురోగతి


మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఎక్కిస్తున్న సహాయక బృందం


ఎస్కవేటర్ ద్వారా మట్టిని తొలగిస్తున్న రెస్క్యూ బృందం

తాజాగా మరో మృతదేహం లభ్యం
- 32 రోజుల అన్వేషణలో రెండు మృతదేహాల గుర్తింపు
- పోస్టుమార్టం కోసం నాగర్‌కర్నూల్‌కు తరలింపు
- మిగతా ఆరుగురి కోసం కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్

అచ్చంపేట/ మన్ననూర్: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చేపడుతున్న సహాయక చర్యల్లో కొంత పురోగతి కనిపించింది. టన్నెల్‌లో చిక్కుకున్న వారిలో మరో కార్మికుడి మృతదేహం లభ్యమైంది. 32 రోజుల అన్వేషణ అనంతరం ఇంజినీర్ మృతదేహాన్ని సహాయక బృందాలు గుర్తించి వెలికితీశాయి. ఇతన్ని జయప్రకాష్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేపీ) కంపెనీ ఇంజినీర్ మనోజ్‌కుమార్‌గా నిర్ధారించారు. మంగళవారం 13.5 కిలోమీటర్ వద్ద మినీ హిటాచీతో మట్టిని తీస్తుండగా చెయ్యి బయట పడింది. అక్కడ దుర్వాసన రావడంతో స్ప్రే బాటిల్స్ వినియోగిస్తూ ఆ ప్రదేశంలో నాలుగు గంటల పాటు సహాయక సిబ్బంది శ్రమించి మృతదేహాన్ని వెలికితీశారు. చేతికి ఉంగరం, గడియారం బట్టి మనోజ్‌కుమార్‌గా తోటి కార్మికులు నిర్ధారించారు. కాడవర్స్ డాగ్స్ చూపిన ప్రదేశంలో కాకుండా లోకో ట్రెన్ పట్టాల మధ్య మృతదేహం లభించినట్లు సమాచారం. ఈ మేరకు కలెక్టర్ బదావత్ సంతోష్ బాధిత కుటుంబానికి ప్రభుత్వ తరఫున రూ.25 లక్షల పరిహారం అందిస్తామని ప్రకటించారు.

■ అయితే కొంచెం అటు ఇటుగా మిగతా కార్మికుల మృతదేహాలు ఉండవచ్చని భావిస్తున్నారు. మరో రెండు మూడు రోజుల్లో మిగతా వారి ఆచూకీ లభించే అవకాశం ఉందని సహాయక సిబ్బంది చెబుతున్నారు. ఈ మేరకు మిగతా ఆరుగురి కార్మికుల ఆచూకీ గుర్తించేందుకు రెస్క్యూ ఆపరేషన్ కొనసాగిస్తున్నారు.

రెవెన్యూ అధికారులు మృతదేహాన్ని స్వస్థలానికి తరలించనున్నట్లు తెలిపారు. ఎస్‌ఎల్‌బీసీ వద్ద పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉన్నావ్ జిల్లా బంగార్మ్ గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్‌కు భార్య స్వర్ణలత, కుమారుడు ఆదర్ష్, కుమార్తె శైలజ, తల్లి జమునాదేవి ఉన్నారు.

కొనసాగుతున్న సహాయక చర్యలు

టన్నెల్‌లో మంగళవారం సహాయక చర్యలు కొనసాగాయి. సింగరేణి, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, దక్షిణమధ్య రైల్వే, హైడ్రా, ర్యాట్ హోల్ మైనర్స్, ఆర్మీ, కాడవర్స్ డాగ్స్, అన్వి రోబోటిక్స్, జీఎస్‌ఐ, జలవనరుల శాఖలకు చెందిన సిబ్బంది ఉదయం, మధ్యాహ్నం షిఫ్టలలో 145 మంది వరకు సొరంగంలోని బురద, మట్టి తొలగింపు, రాళ్లు, టీబీఎం భాగాలు కట్ చేయడం, నీటి ఊటను బయటికి పంపించే చర్యలు చేపట్టారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్, కలెక్టర్ బదావత్ సంతోష్‌కుమార్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా, ఎన్డీఆర్‌ఎఫ్ అధికారి హరీష్, సింగరేణి రెస్క్యూ జీఎం బైద్య పరిస్థితులు సమీక్షిస్తూ సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు.

జల్సాల కోసం గొర్రెల చోరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శివకుమార్

అమరచింత: జల్సా చేస్తూ.. మద్యానికి బానిసైన చింతరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యాపలబావి సురేష్ తన పొలంలో ఆపిన గొర్రెలను దొంగిలించాడని సీఐ శివకుమార్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలను సీఐ విలేకరులకు వెల్లడించారు. నారాయణపేట జిల్లా యల్లంపల్లి గ్రామానికి చెందిన కుర్వ నాగరాజు తన గొర్రెల మందతో అమరచింత మండలంలోని చింతరెడ్డిపల్లి గ్రామ శివారులో ఈ నెల 22న రాత్రి గొర్రెల మంద యాపలబావి సురేష్ వ్యవసాయ పొలంలో ఆపాడు. మరుసటి రోజు గొర్రెల మంద వద్దకు వెళ్లి చూడగా కొన్ని గొర్రె పిల్లలు కనిపించకపోవడంతో అనుమానం వచ్చి పొలం యాజమాని సురేష్‌ను అడగగా తడబడుతూ సమాధానం చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారించగా సురేష్ తనతోపాటు మిట్టనందిమళ్లకు చెందిన కుర్వ గోవిందు, కుర్వ మల్లేష్, చింతరెడ్డిపల్లికి చెందిన సుధాకర్‌తో కలిసి 13 గొర్రెలను దొంగిలించి వాటిని టాటా ఏస్ వాహనంలో కోస్గి సంతకు తీసుకెళ్లి విక్రయించినట్లు అంగీకరించారు. ఈ మేరకు రూ.90 వేలు రాగా.. సురేష్ రూ.30 వేలు తీసుకోగా సహకరించిన మిగతా ముగ్గురు రూ.20 వేల చొప్పున తీసుకున్నట్లు చెప్పారు. దీంతో నిందితుల నుంచి డబ్బులతోపాటు టాటా ఏస్ వాహనం స్వాధీనం చేసుకుని చోరీకి పాల్పడిన వారిని మంగళవారం రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్‌ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అదనపు ఆదాయంగా తేనెటీగల పెంపకం



మాట్లాడుతున్న డీన్ డాక్టర్ పిడిగెం సైదయ్య

కొత్తకోట రూరల్: రైతులు తేనెటీగల పెంపకాన్ని అదనపు ఆదాయపు ఆదాయంగా, వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా చేపట్టవచ్చని మోజర్ల ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగెం సైదయ్య అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యానవన విశ్వవిద్యాలయ పరిధిలోని ఉద్యానవన కళాశాల వేదికగా జిల్లా స్థాయి తేనెటీగల పెంపకంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ కూరగాయల పరిశోధన స్థానం ఆధ్వర్యంలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పిడిగెం సైదయ్య మాట్లాడుతూ భారతదేశంలో లభించే తేనె అత్యంత శ్రేష్టమైనదని, పోషక విలువలతో పాటు ఔషధ గుణాలు ఉండటం వల్ల ఎగుమతికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. తేనెటీగలు పెంపకం వ్యవసాయ ఆధారిత పరిశ్రమగా ఎదిగితే రైతులకు అదనపు ఆదాయం కచ్చితంగా లభిస్తుందన్నారు. వ్యవసాయానికి, పర్యావరణానికి, మానవ సమాజానికి ఎక్కువగా ఉపయోగపడి ఏకైక పరిశ్రమగా తేనెటీగల పెంపకం పేరు పొందిందని గుర్తుచేశారు. భవిష్యత్‌లో సాధించబోయే తీపి విప్లవానికి ప్రధాన భూమిక తేనెటీగల పెంపకం అన్నారు. అనేక బ్యాంకులు, ప్రభుత్వ విభాగాలు తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయని, లోన్లు సైతం ఏర్పాటు ఇస్తున్నందున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అదనపు ఆదాయం పొందాలని సూచించారు. కేవలం కుటుంబ సభ్యులతోనే తక్కువ పెట్టుబడితో ఏడాదంతా ఉపాధి తేనెటీగలు పెంపకంతో లభిస్తుందన్నారు. తేనెకు ఎంతకాలమైనా నిల్వ ఉంటుందని, అందువల్ల నష్టాలు ఎట్టి పరిస్థితుల్లో రావని చెప్పారు. ఇప్పటికే తేనెటీగల పెంపకంలో అనుభవం పొందిన రైతులు, పరిశ్రమల దగ్గర రైతులకు శిక్షణ ఇప్పిస్తామని శాస్త్రవేత్త నిఖిల్ అన్నారు. ప్రధాన శిక్షణ దారులు, అసోసియేట్ ప్రొఫెసర్ షహనాజ్ మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణలో తేనెటీగల జాతులు, శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకం, తేనె పట్టు నిర్వహణ, తేనె తీసే విధానం, తేనెటీగల పెంపకం ద్వారా లభ్యమయ్యే ఉత్పత్తులు, మార్కెటింగ్ మెలకువల గురించి శిక్షణ ఇచ్చామన్నారు.

యువకుడి ఆత్మహత్య


వేముల శివ (ఫైల్)

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తుల వివరాల మేరకు.. అంబట్‌పల్లికి చెందిన వేముల శివ (25) మంగళవారం రాత్రి గ్రామ సమీపంలోని తమ వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి శ్రీను ఇది వరకే మృతి చెందగా.. తల్లి లక్ష్మి ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. అతడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

గోడ కూలి వృద్ధుడు మృతి


బాలయ్య (ఫైల్)

కొడేరు: గోడ కూలి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తెలుగు ఎలగొండ్ల బాలయ్య (60) తను ఉంటే పాత ఇంటి స్థానంలో కొత్త నిర్మాణానికి పూనుకున్నాడు. ఉదయం వేళ పాత గోడను కూలుస్తుండగా ప్రమాదవశాత్తు అతడిపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాలయ్యకు భార్య అలివేల, కుమారుడు, ఇద్దరు కుమార్తె ఉన్నారు.

సబ్ జూనియర్ నేషనల్ కబడ్డీ పోటీలకు జె.సురేష్



మహబూబ్‌నగర్ క్రీడలు: బిహార్ రాష్ట్రం గయా జిల్లాలో ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 34వ సబ్ జూనియర్ నేషనల్ కబడ్డీ పోటీలకు జిల్లాలోని అడ్డాకుల మండలం తిమ్మాయిపల్లి తండాకు చెందిన జె.సురేష్ ఎంపికయ్యాడు. ఇటీవల వికారాబాద్‌లో జరిగిన సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. సురేష్ మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నాడు. సురేష్ ఎంపికపై జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షులు బి.శాంతికుమార్, ప్రధాన కార్యదర్శి ఈ.కురుమూర్తిగౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు ఆర్.బాల్‌రాజు, పాపారాయుడు హర్షం వ్యక్తం చేశారు.

దొంగకు రిమాండ్

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ గురుస్వామి వివరాల మేరకు.. ఆకునెల్లికుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో హుండీ డబ్బులను చోరీ చేసినట్లు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు.. మంగళవారం మేడిపూర్, నెల్లికుదురు మార్గంలో అనుమానాస్పందంగా తిరుగుతున్న కల్వకుర్తి మండలం సుద్దకల్లుకు చెందిన బక్కయ్యను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో అతడిని విచారించడంతో చేసిన నేరాన్ని ఒప్పుకొన్నాడని.. అతడిని కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

జడ్చర్ల: మండలంలోని మంగలికుంటతండాలో ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. వివరాలు.. రాజాపూర్ మండలం సోమ్లనాయక్‌తండాకు చెందిన పాత్లావత్ మహేశ్(26)కు జడ్చర్ల మండలం మంగలికుంటతండాకు చెందిన పద్మతో ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉండగా మూడునెలల క్రితం భర్తతో గొడవపడిన భార్య పద్మ తన కుమారుడిని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మహేశ్ కూడా అత్తగారింటికి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. ఈక్రమంలో భార్య పద్మతో పాటు కుటుంబసభ్యులు మహేశ్‌తో గొడవపడి కొట్టేవారు. సోమవారం ఇంట్లో ఫ్యాన్ కొండికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య కుటుంబీకులు మహేశ్ తల్లికి సమాచారమిచ్చారు. మంగళవారం ఆమె కుమారుడి మృతదేహాన్ని పరిశీలించి మరణంపై అనుమానం ఉందని, సమగ్ర విచారణ జరపాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

కల్వకుర్తి టౌన్: వ్యక్తి అదృశ్యమైన ఘటనలో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీకి చెందిన రుక్నుద్దీన్ అప్పులు ఎక్కువయ్యాయని చెప్పి గతేడాది డిసెంబర్‌లో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువుల ఇళ్ల వద్ద, ఇతర ప్రాంతాలలో ఎంత వెతికినా అతని ఆచూకీ లభించలేదు. బాధితుడి తండ్రి జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

క్వారీలపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..

కృష్ణా: మండలంలోని నల్లగట్టు, పిల్లిగుండ్ల గట్టుకు ఉన్న క్వారీలపై విచారణ చేస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేష్ తెలిపారు. మంగళవారం సాక్షిలో 'నల్ల'గుట్టు' రట్టయ్యేనా' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఉదయం నల్లగుట్టను ఆర్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డితో కలిసి తహసీల్దార్ సందర్శించి క్వారీలపై విచారణ చేపట్టారు. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు లేని వాటిని గుర్తించి జిల్లా అధికారులకు నివేదిక అందజేయనున్నట్లు వారు తెలిపారు. కేవలం నాల్గింటికి మాత్రమే అనుమతులు ఉన్నాయి, మిగితా లేనివాటిలో పనులను నిలిపివేస్తామన్నారు. ఈ గుట్ట నుంచి రైల్వే శాఖకు గ్రావెల్‌ను తరలించుటకు అనుమతులు అన్‌లిమిటెడ్‌గా ఉన్నాయని తహసీల్దార్ తెలపడం విశేషం. అధికారులు పరిశీలించిన చోట అక్రమార్కులు గుట్టకు దాదపు 30 ఫీట్లు భూమి నుంచి దిగువకు గొయ్యి తవ్వారు. మైనింగ్ శాఖ రాయిని తీయడానికి కేవలం భూమిపై భాగంలో ఉన్నవాటిని మాత్రమే అంటే భూమి లెవల్ వరకు మాత్రమే అనుమతులు ఇచ్చారు. కానీ ఇక్కడ భూమిలోపలి వరకు తవ్వినట్లు గుర్తించారు. ఇలా తవ్విన గుంతల్లో నీళ్లు నిలిచి వర్షాకాలంలో వన్య ప్రాణులు, పశువులు, మనుషులు పలుమార్లు ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. ఈ విచారణ బుధవారం కూడా కొనసాగుతుందని, జిల్లా మైనింగ్ శాఖ వారు పాల్గొంటారని తెలిపారు.


నల్లగుట్టకు ఏర్పాటు చేసిన క్వారీలపై విచారణ చేపట్టిన తహసీల్దార్ వెంకటేష్

బొటానికల్ గార్డెన్‌లో మహారాష్ట్ర పరిశోధకులు


గార్డెన్‌లోని మొక్కను పరిశీలిస్తున్న మహారాష్ట్ర పరిశోధకులు

జడ్చర్ల టౌన్: మహారాష్ట్రలోని సద్గురు గంగజీర్ మహారాజ్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలకు చెందిన పరిశోధకులు డా. నిలేష్ మాల్పూరి, డా. బండారి తర్హాల్, గోసావి, కై లార్ మంగళవారం పట్టణంలోని డా. బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. వారికి ప్రిన్సిపాల్ డా. సుకన్య, బొటానికల్ గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య స్వాగతం పలికారు. గార్డెన్‌తో పాటు స్టేట్ హెర్బేరియంను సందర్శించిన వారు అకాంతేసి, యుఫర్బియేసి కుటుంబాలకు చెందిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా డా. నిలేశ్ మాల్పూరి మాట్లాడుతూ.. పరిశోధక విద్యార్థులు దక్షిణ భారతదేశంలోని డైక్లిప్టెరా యుఫోర్బియా ప్రజాతులపై పరిశోధన చేస్తున్నారని, అందులో భాగంగానే ఇక్కడి స్టేట్ హెర్బేరియం, బొటానికల్ గార్డెన్‌ను సందర్శించామన్నారు. ఇక్కడ భద్రపర్చిన మొక్కల నమూనాలు పరిశోధనకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. తమ పరిశోధన గ్రంథంలో కళాశాల పేరును ప్రస్తావిస్తామన్నారు.

'సూక్ష్మజీవుల అద్భుతాలు'పై వర్క్‌షాప్

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం సూక్ష్మజీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'సూక్ష్మజీవుల అద్భుతాలు – సాధారణ వృక్షజాలం గుండా ప్రయాణం' అన్న అంశంపై ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించగా ప్రిన్సిపాల్ డా. సుకన్య ప్రారంభించి మాట్లాడారు. వర్క్‌షాప్‌ల నిర్వహణతో విద్యార్థుల్లో జ్ఞానం, నైపుణ్యాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. ముఖ్యవక్తగా ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సహాయ ఆచార్యులు డా. జె.శ్రీదేవి జడ్చర్ల ప్రాంతంలోని సూక్ష్మ జీవజాలం.. వాటి ప్రాముఖ్యత, వేరు చేసే పద్ధతులు, పరిశోధనల గూరించి వివరించారు. అనంతరం వివిధ సూక్ష్మజీవులను వేరుచేసే పద్ధతులు, మెళకువలను నేర్పించారు. కార్యక్రమంలో సూక్ష్మజీవశాస్త్ర అధిపతి డా. మాధురి, 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన..

కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2, 4, ఉమెన్ ఎంపవర్‌మెంట్‌సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్ మాట్లాడుతూ.. ఇటీవల గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువయ్యాయని, ప్రతి విద్యార్థి సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ బాబుల్‌రెడ్డి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. సుకన్య, వైస్ ప్రిన్సిపాల్ నర్మద, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ప్రవీణ్‌కుమార్, మాధురి, నందకిశోర్, పుష్పలత, రాఘవేందర్‌రెడ్డి, సూరయ్య, జబీన్, రాజేశ్వరి, నర్సింహారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ బాబుల్‌రెడ్డి

కేఎల్ఐ డీ–1 కాల్వకు గండి


తెగిన కాల్వను పరిశీలిస్తున్న రైతులు

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లితండా సమీపంలో ఉన్న కేఎల్ఐ పస్పుల బ్రాంచ్ కెనాల్ డీ–1 కాల్వకు మంగళవారం గండి పడి పొలాల మీదుగా ప్రవహించడంతో పాటు చివరి ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. కాల్వ పర్యవేక్షణను ఇరిగేషన్ అధికారులు విస్మరించడంతో జమ్ము పేరుకుపోయిందని.. నీరు ముందుకు పారక చివరి ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి నెలకొందని తెల్లరాళ్లపల్లి, తెల్లరాళ్లపల్లితండా రైతులు వాపోతున్నారు. కాల్వ తెగి సాగునీరు వృధా అవుతుంటే తమ పరిధి కాదంటూ నాగర్‌కర్నూల్, వనపర్తి ఇరిగేషన్ అధికారులు తప్పించుకుంటున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి మరమ్మతు చేసి చివరి ఆయకట్టుకు సాగునీరు సాఫీగా చేరేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. సమస్యను వనపర్తి ఇరిగేషన్ ఈఈ మధుసూదన్‌రావు వద్ద ప్రస్తావించగా.. ఆ కాల్వ మరమ్మతు నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోకి వస్తుందన్నారు.

పోక్సో కేసులో 25 ఏళ్ల జైలు శిక్ష

నారాయణపేట రూరల్: బాలికను ప్రేమ పేరుతో అత్యాచారం చేసిన ఓ యువకుడికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ మంగళవారం 25 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. నారాయణపేట మండలానికి చెందిన ఓ బాలిక హైదరాబాద్‌లోని బుద్వేల్ ప్రాంతంలో నివసిస్తున్న సమయంలో అక్కడే పని చేస్తున్న వేముల అభిలాష్ (21) ప్రేమిస్తున్నానంటూ వెంటపడ్డాడు. మార్చి 1న బాలిక కర్ణాటకలోని అన్వూర్‌లో బంధువుల పెళ్లికి వెళ్లి వస్తుండగా నారాయణపేట బస్టాండ్‌లో కిడ్నాప్ చేసి బుద్వేల్‌లోని ఓ ఇంట్లో బంధించి పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ విషయం అమ్మాయి తండ్రికి తెలియజేయడంతో 2వ తేదీన నారాయణపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిని పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా.. నేరం రుజువు కావడంతో మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.60 వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం అందించాలని తీర్పునిచ్చారు. తక్కువ సమయంలో కేసు ఛేదించడంతో డీఎస్పీ లింగయ్య, సీఐ శివకుమార్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, లైజనింగ్ అధికారి కృష్ణయ్యగౌడ్, విజయ్కుమార్, మీర్జా బేగ్‌ను ఎస్పీ అభినందించారు.

సైబర్ నేరస్తుడికి ఏడాది జైలుశిక్ష

ఊర్కొండ: సైబర్ నేరానికి పాల్పడి డబ్బులు కాజేసిన నిందితుడికి ఏడాది జైలుశిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ కల్వకుర్తి కోర్టు న్యాయమూర్తి కావ్య మంగళవారం తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ కృష్ణదేవ వివరాల మేరకు.. బీహార్‌కు చెందిన సత్యేంద్ర రాయ్ మండలంలోని సూర్యలత కాటన్ మిల్లులో పనిచేస్తున్నాడు. గతేడాది నవంబర్ 9న ఓ యాప్ ద్వారా అతడు రూ. 1.25లక్షలు పోగొట్టుకున్నాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. జార్ఖండ్ రాష్టానికి చెందిన ఎండీ అమీర్ అన్సారీ సైబర్ నేరానికి పాల్పడి డబ్బులు కాజేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ప్రస్తుత సీఐ విచారణ జరిపారు. కల్వకుర్తి కోర్టులో సాక్ష్యాధారాల పరిశీలన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కావ్య తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ తెలిపారు.